

**నకిలీ పోలీసు ఆటకట్టు**

పోలీస్‌గా చలామణి అవుతూ నేరాలకు పాల్ప డుతున్న వ్యక్తిని మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. - 10లో



**మట్టి రోడ్లకు మరమ్మతులు**

రామన్నపేట మండలంలోని పలు గ్రామాల మట్టి రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. - 11లో

గరిష్ఠం/కనిష్ఠం 29.0°/13°

**వాతావరణం**

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### ఈవీఎంల గోదాం పరిశీలన



గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్

భువనగిరిటౌన్ : కలెక్టరేట్ ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచిన గోదామును శనివారం కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంలను పరిశీలించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బట్టు రామచంద్రయ్య, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ గిరిధర్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంచాలి



బోధనా సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డి

బీబీనగర్ : విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్‌సీఈఆర్టీ (స్కూల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) డైరెక్టర్ రాధారెడ్డి సూచించారు. బీబీనగర్ మండలం జమీలాపేటలోని ప్రాథమిక పాఠశాలను ఆమె శనివారం సందర్శించారు. పాఠశాలలో కొనసాగుతున్న మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోధనాభ్యాసంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థమయ్యే రీతిలో సామగ్రిని ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, మండల నోడల్ అధికారి యాదగిరి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు రాజారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎలిజబెత్, గెజిటెడ్ హెచ్‌ఎం స్వరూపారాణి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరిటౌన్ : విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యనభ్యసించే మైనార్టీ విద్యార్థులు ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారి యాదయ్య తెలిపారు. పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత చదువులకోసం ఆగస్టు 1నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.20 లక్షల ఉపకార వేతనంతో పాటు విమాన ప్రయాణ ఖర్చులకు మరో రూ.60 వేలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈనెల 23 నుంచి telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### బస్తీ దవాఖానాల పనులు త్వరగా పూర్తి చేయండి

భువనగిరి : బస్తీ దవాఖానాల పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. భువనగిరిలోని హనుమాన్‌వాడ, తారకరామనగర్, ఇందిరానగర్‌లో బస్తీ దవాఖానల పనులను పరిశీలించారు. జాప్యం చేయకుండా నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు.అనంతరం సమీకృత మార్కెట్, పెద్దచెరువు వద్ద లవ్ భువనగిరి లోగో పాయింట్,గ్రీనరీ పనులు పరిశీలించారు.

### పోటీ ప్రపంచానికి అనుగుణంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

సాక్షి, యాదాద్రి : విద్యార్థులను ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా తీర్చిదిద్దాలని డీఈఓ నారాయణరెడ్డి, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ సభ్యులు, ప్రముఖ సైన్స్ సాహిత్య రచయిత్రి చాగంటి కృష్ణకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఉపాధ్యాయుల శిక్షణ ముగింపులో వారు మాట్లాడారు. పాపులర్ సైన్స్ ద్వారా పాఠాలు నేర్పి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా విద్యార్థులనుప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో తీర్థారామ్, పద్మప్రభు, కరీమా, శ్రీనివాస్, భరణికుమార్ పాల్గొన్నారు.

**ప్రత్యేక తరగతుల పరిశీలన**

భువనగిరి : టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ సూచించారు. శనివారం బీఎన్ తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు.

# ఇంటింటికి కాంగ్రెస్

**క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి**

- కేడర్‌లో ఉత్సాహం నింపే కార్యక్రమాలు
- ఈనెల 12 లోపు సంస్థాగత కమిటీలన్నీ పూర్తి
- 26 నుంచి పాదయాత్రలు, రోడ్ షోలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ఆందోళనలు
- నేడు భువనగిరిలో సమావేశం కానున్న జిల్లా స్థాయి ముఖ్య నేతలు



సాక్షి, యాదాద్రి : జిల్లాలో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకత్వం క్షేత్రస్థాయి కార్యక్రమాలకు సన్నద్ధం అవుతోంది. రానున్న శాసనసభ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజల మధ్యన ఉండాలన్న అధిష్టానం నిర్ణయం మేరకు కార్యాచరణ రూపొందించింది. కేడర్‌ను ఉత్తేజితులను చేయడానికి విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో హాత్‌సే హాత్ జోడో అభియాన్ జిల్లాలో కొనసాగనుంది. గత నెల 28న సికింద్రాబాద్‌లోని గాంధీ ఐడియాలోజి కేంద్రంలో జరిగిన శిక్షణ శిబిరంలో డీసీసీ అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, పీసీసీ డెలిగేట్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. సంస్థాగత పునర్నిర్మాణం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడడం, రైతు సమస్యలపై ఆందోళనలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం భువనగిరిలో జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్యులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

**కొత్త కమిటీల నియామకం**

జిల్లాలో ఇప్పటి వరకు పనిచేస్తున్న పట్టణ, మండల, అనుబంధ సంఘాల కమిటీలను రద్దు చేసి కొత్త కమిటీలు వేయనున్నారు. ఇటీవల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం పూర్తయ్యింది. మిగాతా కమిటీల నియామకం చేపట్టాలని టీపీసీసీ ఆదేశించింది. భువనగిరి, ఆలేరులో కమిటీలను కొన్నిచోట్ల రెన్యూవల్ చేయనుండగా, కొన్ని కొత్తగా వేయనున్నారు. జిల్లా అధ్యక్షునిగా కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి రెండవసారి నియమితులయ్యారు. పూర్తిస్థాయి జిల్లా కార్యవర్గం ఏర్పాటు చేయాల్సి ఉంది. నూతన జిల్లా ఏర్పాటు తర్వాత పూర్తిస్థాయి కమిటీ ఇప్పుడే ఏర్పాటు కాబోతుంది. దీంతో జిల్లాలోని పలువురు సీనియర్లకు పదవులు దక్కే అవకాశం ఉంది. మహిళా, రైతు, ఐఎన్‌టీయూసీ, మైనార్టీసెల్‌తో పాటు పలు కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు జిల్లా స్థాయి కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో వేయాల్సి ఉంది. అలాగే మహిళా కాంగ్రెస్, రైతు, యువజన అన్ని అనుబంధ సంఘాలను నూతనంగా అధ్యక్షులతోపాటు పూర్తిస్థాయి కమిటీలు వేయనున్నారు. నేడు భువనగిరిలో జరగనున్న పార్టీ ముఖ్య నేతల సమావేశంలో కమిటీల నియమాకంపై చర్చించనున్నారు. ఈనెల 12 లోగా ప్రక్రియ పూర్తి కానుంది.

**పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు**

మున్సిపల్, మండల శాఖల అధ్యక్షుల పదవులు రద్దు కావడంతో నూతన కమిటీలపై ఆశావహులు దృష్టి సారించారు. ఇప్పటికే పదవుల్లో ఉన్నవారు తమ పదవిని కాపాడుకోవడానికి ప్రయత్నాలు చేస్తుండగా, ఆశావహులు అధిష్టానం, జిల్లా, నియోజకవర్గం స్థాయి నేతల వద్ద తమ ప్రయత్నాలు చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తూ పోటీ చేయాలనుకునే నాయకులు విధేయతకు పట్టంగట్టే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం పదవుల్లో ఉన్నవారిని కొనసాగించడమే మేలన్న నిర్ణయం నియోజకవర్గ ఇంచార్జ్‌ల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ముందు చిక్కులు తెచ్చుకోవడం ఎందుకన్న అభిప్రాయంతో ఉన్నారు. భువనగిరి నియోజకవర్గంలో మార్పులు కన్పిస్తుండగా ఆలేరులో పాత కమిటీలే రెన్యూవల్ కానున్నాయని తెలుస్తోంది. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వెంట వెళ్లిన వారి స్థానంలో కొత్తవారికి అవకాశాలు దక్కనున్నాయి.

**రెండు నెలల పాటు కార్యక్రమాలు**

పార్టీ లక్ష్యాలు వివరిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ జిల్లాలో రెండు నెలల పాటు హాత్‌సే హాత్ జోడో పాదయాత్రలు, రోడ్ షోలు, సభలు నిర్వహించనున్నారు. ఈనెల 26 నుంచి మార్చి 26 వరకు ఇంటింటికి రాహుల్‌గాంధీ సందేశం పేరుతో పాదయాత్రలు జరుగుతాయి. జిల్లా పరిధిలోని భువనగిరి ఆలేరు, తుంగతుర్తి, మునుగోడు, నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంటింటికి రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ సందేశాన్ని తీసుకువెళ్తారు. సీనియర్లు, పార్టీలోని వివిధ వర్గాలను కలుపుకుపోతారు. ప్రధాన రైతు సమస్యలైన ధరణి, ఏక కాలంలో రుణమాఫీ, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో జాప్యంపై ప్రజలకు వివరించనున్నారు. భువనగిరి నియోజకవర్గంలో కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఆలేరు నియోజకవర్గంలో బీర్ల అయిలయ్య నేతృత్వంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## కంటి వెలుగును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ, జెడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కలెక్టర్లు

- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- అధికారులు, ప్రజాప్రతినిధులతో ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశం



హాజరైన ప్రజాప్రతినిధులు

నల్లగొండ టౌన్ : రాష్ట్రంలో కంటి సమస్యతో బాధపడుతున్న ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కోరారు. శనివారం స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం, వార్డుల్లో క్యాంపులు ఏర్పాటు చేసి పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా కంటి అద్దాలు, మందులు అందించనున్నామని తెలిపారు. మొదటి విడతలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమం మంచి ఫలితాలు ఇచ్చినందున రెండో విడత నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ నుంచి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభిస్తారని వెల్లడించారు. వంద రోజుల్లో కార్యక్రమాన్ని పూర్తి చేయాలని దానికి ప్రజా ప్రతినిధులంతా సహకరించాలని కోరారు.

**తెలంగాణలో అద్భుతమైన ప్రగతి**

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రగతిని సాధిస్తోందని మంత్రి తెలిపారు. 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న ఘనత తెలంగాణ రాష్ట్రానిదే అన్నారు. జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య పరిష్కారం కోసం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచి నీరు అందిస్తున్నామని చెప్పారు. రెండు సంవత్సరాలుగా ధాన్యం పండించడంలో పంజాబ్, హర్యాణాను అధిగమించి దేశంలో నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిచిందని చెప్పారు. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు పెంపొందించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం ద్వారా ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. హరితహారం ద్వారా 240 కోట్ల మొక్కలు నాటి 4 శాతం అటవీ విస్తీర్ణం పెంచి హరిత తెలంగాణగా రికార్డు సాధించామని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, జెడ్పీ చైర్మన్లు బండ నరేందర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎన్.భాస్కర్ రావు, గాదరి కిషోర్‌కుమార్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఆగ్రో చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, ట్రైకార్ చైర్మన్ రామచంద్రానాయక్, భువనగిరి, నల్లగొండ , సూర్యాపేట జిల్లాలకు చెందిన కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీఎంహెచ్‌ఓలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## వలిగొండ అభివృద్ధికి నిధులివ్వండి



ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యేకు డీసీసీ అధ్యక్షుడి వినతి

వలిగొండ : వలిగొండకు రూ.10 కోట్లు మంజూరు చేసి అన్ని విధాలా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆదివారం వలిగొండలో క్రీడల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేను ఆయన కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. ఈ మార్గంలో వర్షాకాలం రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బీటీ మంజూరు చేయాలని, బస్టాండ్ ఆవరణలో సీసీ నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. అదే విధంగా పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ పెరుగుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రోడ్డు విస్తరణ చేపట్టి సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రంథాలయం శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం నిర్మించాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రి భవనం కూడా శిథిలావస్థకు చేరడంతో రోగులు బిక్కుబిక్కుమంటు గడుపుతున్నారని, నూతన భవనం నిర్మించాలని విన్నవించారు. ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరుగుతున్నందున సామర్థ్యాన్ని 30 పడకలకు పెంచేందుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంకల కిష్టయ్య, కొండూరు సాయి, బత్తిని నగేష్, గుండాల సాయి, బత్తిని అరుణ్, పూసుకురి లింగస్వామి, పల్లెర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

- నారసింహుడిగా యాదాద్రీశుడు



అధ్యయనోత్సవాల్లో భాగంగా శనివారం నారసింహుడిగా దర్శనమిచ్చిన స్వామివారు

## చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ దశరథరామయ్య



పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమావేశమైన లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ దశరథరామయ్య

చౌటుప్పల్ : ప్రతి పౌరుడూ చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ కాట్రగడ్డ దశరథ రామయ్య పేర్కొన్నారు చౌటుప్పల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టును శనివారం ఆయన సందర్శించారు. కోర్టు భవనం, పరిసరాల్లో కలియ దిరిగి పరిశీలించారు. వసతులు, సమస్యలపై ఆరా తీశారు. అనంతరం న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులు చట్టాలపై అవగాహన కలిగి ఉండడం వల్ల అనేక సమస్యల నుంచి సులభంగా బయటపడవచ్చన్నా రు. ప్రజలకు చట్టాలపై అవగాహన ఉండాలంటే తరచు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించాలని న్యాయవాదులు, పోలీసు అధికారులకు సూచించారు. నేరాలకు పాల్పడడం వల్ల తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రజలు కూడా నేరాలకు పాల్పడవద్దన్నారు. తద్వారా ఆర్థికంగా, కుటుంబ పరంగా ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐ ఎరమాద మల్లికార్జున్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలమోని శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బాల్యం వెంకటాచలపతి, న్యాయవాదులు ఊడుగు శ్రీనివాస్, రవీందర్, రమేష్, స్వాతి, శ్రీశైలం, జంగయ్య, శంకర్, కోర్టు సూపరింటెండెంట్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి స్పెషల్

**పండుగకు అదనపు బస్సులు నడుపుతున్న ఆర్టీసీ**

- 23వ తేదీ వరకు వివిధ రూట్లలో 339 బస్సులు
- ఆంధ్రా ప్రాంతానికి మరో 60 ప్రత్యేక సర్వీసులు



నల్లగొండ రూరల్, భానుపురి(సూర్యాపేట): సంక్రాంతి పండుగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వివిధ రూట్లలో అదనపు బస్సులను తిప్పేందుకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా రద్దీ రూట్లను గుర్తించి నల్లగొండ రీజియన్ పరిధిలో దాదాపు 339 ప్రత్యేక బస్సులతో అదనపు సర్వీసులు నడపాలని నిర్ణయించింది. ఈ మేరకు శనివారం నుంచే స్పెషల్ బస్సులను నడుపుతోంది. ఈ ప్రత్యేక బస్సులు ఈనెల 23వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మరింత ఆదాయాన్ని పొందేందుకు మరో 60 బస్సులను ఆంధ్రా ప్రాంతానికి సైతం నడుపుతున్నారు.

**రీజియన్ పరిధిలో 399 బస్సులు**

నల్లగొండ రీజియన్ పరిధిలోని నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ, నార్కట్‌పల్లి, సూర్యాపేట, కోదాడ, యాదగిరిగుట్ట బస్ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రయాణికులు రద్దీగా ఉండి.. ఇప్పటికే గుర్తించిన రూట్లలో ఈనెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 339 బస్సులను నడపనున్నారు. మొదటి రోజు రాష్ట్రంలో 24 బస్సులు, ఇతర రాష్ట్రాలకు 7, ఈనెల 8న స్థానికంగా 55, ఇతర రాష్ట్రాలకు 7, ఈనెల 9వ తేదీన స్థానికంగా 21, ఇతర ప్రాంతాలకు 3, ఈనెల 10న కేవలం ఇతర రాష్ట్రాలకు రెండు బస్సులు, 11న 7బస్సులను మాత్రమే నడపనున్నారు. అనంతరం ఈ నెల 12న స్థానికంగా 35, ఇతర ప్రాంతాలకు 7బస్సులు, 13న స్థానికంగా 100 బస్సులు, ఇతర ప్రాంతాలకు 15 బస్సులు, ఈనెల 14న స్థానికంగా 104 బస్సులు, ఇతర ప్రాంతాలకు 12 బస్సుల చొప్పున నడపాలని నిర్ణయించారు. సంక్రాంతి పండుగ ముగిశాక ప్రయాణికులు తమ గమ్యస్థానానికి చేరుతారని భావిస్తున్న ఆర్టీసీ అధికారులు ఈనెల 23 వరకు ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటే అప్పటికప్పుడు బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచుతారు. ముందస్తుగా రానుపోనూ ఆన్‌లైన్ బుకింగ్ చేసుకుంటే టికెట్ ధరపై 10శాతం రాయితీ కల్పించారు.

**ఆన్‌లైన్ రిజర్వేషన్ ఆధారంగా!**

తెలంగాణ ప్రాంతంలో దసరాకు ఉన్నంత రద్దీ సంక్రాంతి పర్వదినానికి ఉండదు. ఈ రద్దీ ఆంధ్రా ప్రాంతానికి అధికంగా ఉండడం.. సంస్థకు మంచి ఆదాయాన్ని సంపాదించాలన్న ఆలోచనతో యాజమాన్యం నల్లగొండ రీజియన్ పరిధి నుంచి దాదాపు 60 బస్సులను కేటాయించింది. ఆయా డిపోలకు చెందిన ఈ బస్సుల్లో టికెట్లను ప్రయాణికులు ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఈ బస్సులు ఆంధ్రతో పాటు ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు సేవలందించనున్నాయి

అయితే పండుగకు నడిపే స్పెషల్ బస్సులకు అదనపు చార్జీలను వసూలు చేయొద్దని నిర్ణయించడంతో ప్రయాణికులకు ఊరట కలిగినట్లయింది. గతంలో పండుగ వచ్చిందంటే టికెట్‌పై 20నుంచి 30 శాతం అదనపు చార్జీలు వసూలు చేసేవారు. సంస్థ ఎండీగా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత బస్సులు చార్జీలు పెంచడంతో ఈ అదనపు చార్జీల వసూలు చేయడం లేదు.

**డిపోల వారీగా ..**

| డిపో | బస్సులు |
| --- | --- |
| నల్లగొండ | 64 |
| దేవరకొండ | 43 |
| మిర్యాలగూడ | 61 |
| నార్కట్‌పల్లి | 15 |
| సూర్యాపేట | 62 |
| కోదాడ | 50 |
| యాదగిరిగుట్ట | 44 |
| ఇతర ప్రాంతాలకు | 60 |

**ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి**



సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో పెంచుకుని ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించాం. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం ఇబ్బంది పడకుండా నడుపుతున్నాం. కొరత లేకుండా సర్వీసులను నడుపుతాం. ఆన్‌లైన్ రిజర్వేషన్ల ఆధారంగా ఇతర రాష్ట్రాలకు సైతం బస్సులు నడుపుతున్నాం. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి.

– వరప్రసాద్, ఆర్టీసీ ఆర్‌ఎం

## క్లుప్తంగా

### రసాయన పరిశ్రమలో కెమికల్ లీక్

- ఒకరికి గాయాలు

**చౌటుప్పల్:** మండల పరిధిలోని మంధోళ్లగూడెం గ్రామంలో గల సైమెడ్ కెమికల్ పరిశ్రమలో స్టోరేజ్ ట్యాంక్ నుంచి కెమికల్ లీకవ్వడంతో అందులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి గాయపడ్డాడు. శనివారం చౌటుప్పల్ ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా పెద్దపూడి మండలం కైకవోలు గ్రామానికి చెందిన నుని త్రినాథ్(27) మంధోళ్లగూడెం గ్రామంలోని సైమెడ్ కెమికల్ కంపెనీలో కొంతకాలంగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే కంపెనీలోని క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఈ నెల 3న కంపెనీలో గేటు బ్లాకును శుభ్రం చేస్తుండగా స్టోరేజ్ ట్యాంక్ నుంచి కెమికల్ లీకవ్వడంతో త్రినాథ్ గాయపడ్డాడు. అతడి కళ్లు, శరీరంపై కాలిన గాయాలయ్యాయి. వెంటనే సహచర ఉద్యోగులు చౌటుప్పల్‌లోని ఓ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. శనివారం బాధితుడి బంధువు ఎం. మాలతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

### టాటా ఏస్, కారు ఢీ.. ముగ్గురికి గాయాలు

**కొండమల్లేపల్లి:** టాటా ఏస్, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గేటు వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. కొండమల్లేపల్లికి చెందిన పలువురు టాటా ఏస్ వాహనంలో పెండ్లిపాకల వద్ద ఉన్న డీ–7కాలువలో బట్టలు ఉతకడానికి వెళ్తున్నారు. అదే సమయంలో పెద్దవూర నుంచి కొండమల్లేపల్లి వైపు వస్తున్న కారు చిన్నఅడిశర్లపల్లి గేటు మలుపు వద్ద టాటా ఏస్ వాహనాన్ని ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడగా, అందులో వెళ్తున్న యేసయ్య, వెంకన్న, అనూషకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నారాయణరెడ్డి పేర్కొన్నారు.



# నిలిచిన విద్యుత్ సబ్సిడీ

- కరెంట్ బిల్లులు చెల్లించాలని సెలూన్లు, లాండ్రీ షాపుల నిర్వాహకులపై విద్యుత్ సిబ్బంది ఒత్తిడి
- రెండు నెలల నుంచి సబ్సిడీ డబ్బులు విడుదల చేయని ప్రభుత్వం



**నల్లగొండ:** నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్లకు, రజకులు నిర్వహించే లాండ్రీ షాపులు, దోబీఘాట్లకు ఉచితంగా ఇస్తున్న విద్యుత్‌కు సంబంధించిన సబ్సిడీ డబ్బులను గత రెండు నెలలుగా ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో విద్యుత్ అధికారులు బిల్లులు చెల్లించాలని వారిపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. అంతకుముందు కూడా ఇదేవిధంగా సబ్సిడీ డబ్బులు విడుదల కాకపోవడంతో విద్యుత్ అధికారులు బిల్లులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో ప్రభుత్వం స్పందించి అక్టోబర్‌లో సబ్సిడీ డబ్బులు విడుదల చేసింది. ఇప్పుడు మళ్లీ సబ్సిడీ డబ్బుల విడుదలలో జాప్యం జరుగుతుండడంతో సెలూన్లు, లాండ్రీ షాపులు, దోబీఘాట్ల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు.

**250యూనిట్ల వరకు ఉచితం..**

నాయీబ్రాహ్మణులు, రజకులకు వృత్తి పరంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వారికి తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ బిల్లులో సబ్సిడీ ఇస్తూ అండగా ఉంటుంది. ప్రతి ఒక్క షాపుకు ప్రతినెలా 250 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తుంది. దీంతో జిల్లాలో 1581 మంది నాయీ బ్రాహ్మణులు, 5258 మంది రజకులకు వారు నిర్వహిస్తున్న సెలూన్లు, లాండ్రీ షాపులకు ఉచిత విద్యుత్ అందుతుంది. అయితే రెండు మాసాల నుంచి ప్రభుత్వం నుంచి విద్యుత్ సబ్సిడీ బిల్లులు అందడం లేదు. నూటికి నూరు శాతం బిల్లులు వసూలు చేయాలని విద్యుత్ అధికారులపై సీఎండీ స్థాయి నుంచి ఆదేశాలు రావడంతో వారు సెలూన్లు, లాండ్రీ షాపులు నిర్వహిస్తున్న యజమానుల వద్దకు వచ్చి కరెంట్ బిల్లులు చెల్లించాలని ఒత్తిడి తెస్తుండడంతో రజకులు, నాయీ బ్రాహ్మణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ బిల్లులను విడుదల చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

**బిల్లులు చెల్లించమంటున్నారు**

నా సెలూన్‌కు సంబంధించి రెండు మాసాల నుంచి విద్యుత్ సబ్సిడీ రావడం లేదని విద్యుత్ సిబ్బంది బిల్లులు చెల్లించమంటున్నారు. ప్రభుత్వం ఒక్కరూపాయి కూడా చెల్లించవద్దని చెబుతున్నా, విద్యుత్ అధికారులు మాత్రం 'మాకు పై నుంచి ఒత్తిడి ఉంది మీరు బిల్లులు చెల్లించాలి' అని అంటున్నారు.
– వేణు, సెలూన్ షాపు నిర్వాహకుడు, తిప్పర్తి

# నకిలీ పోలీసు ఆటకట్టు

- వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడిన కేటుగాడు

**మిర్యాలగూడ అర్బన్:** నకిలీ పోలీసు అవతారమెత్తి నేరాలకు పాల్పడుతున్న వ్యక్తిని శనివారం మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నిగిడాల సురేష్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణంలోని వాసవీనగర్ కాలనీకి చెందిన దాసరి రాజు తాను పోలీసునని చెప్పి బెదిరించి 2022 జనవరిలో పాములూరు వద్ద ఓ వ్యక్తి నుంచి బుల్లెట్ బైక్‌ను తీసుకెళ్లాడు. అదేవిధంగా మిర్యాలగూడకు చెందిన చందాల తిరుపతి గత నెల 30న తాను గొర్రెలు విక్రయించిన వ్యక్తి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతుండడంతో మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చాడు. అప్పుడు అక్కడే ఉన్న రాజు తాను క్రైం బ్రాంచ్ పోలీసునని తిరుపతికి పరిచయం చేసుకుని, సమస్యను పరిష్కరిస్తానని చెప్పి తిరుపతి వద్దనుంచి రూ.5వేలు తీసుకున్నాడు. రాజుపై అనుమానం వచ్చిన తిరుపతి ఈ నెల 4న టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం ఉదయం మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బుల్లెట్ బైక్‌పై వెళ్తున్న దాసరి రాజును ఆపి బండి కాగితాలు చూపించాలని అడగ్గా పొంతన లేని సమాధానాలు చెప్పాడు. అతడి వద్ద నకిలీ పోలీసు గుర్తింపుకార్డును గుర్తించిన పోలీసులు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా తాను చేసిన మోసాలను అంగీకరించాడు. నిందితుడు గతంలో వాడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గేదెలు అపహరించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ ఎస్. కృష్ణయ్య, డి. వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ పి. వెంకటేశ్వర్లు, షేక్ గఫార్, కానిస్టేబుళ్లు ఎం. రామకృష్ణ, డి. నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ సురేష్, వెనుక నిందితుడు

# మాసాయిపేటలో రెండు ఇళ్లలో చోరీ

- ఐదున్నర తులాల బంగారం, నగదు ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

**యాదగిరిగుట్ట:** మండలంలోని మాసాయిపేట గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి రెండు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట గ్రామానికి చెందిన వాకిటి కిష్టయ్య, అతడి కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి తమ ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న తన బిడ్డ ఇంట్లో నిద్రించడానికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు కిష్టయ్య ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడి బీరువాలో ఉన్న 5తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదును దోచుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన గిరెడ్డి జనార్దన్‌రెడ్డి గత రెండు నెలలుగా హైదరాబాద్‌లోని తన బిడ్డ ఇంటి వద్ద ఉంటున్నాడు. జనార్దన్‌రెడ్డి ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి అర తులం బంగారం దొంగిలించారు. శనివారం ఉదయం స్థానికులు గమనించి యాదగిరిగుట్ట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు క్లూస్ టీంతో సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ మేరకు పట్టణ సీఐ సైదయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ వెల్లడించారు.

**వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో..**

**చివ్వెంల(సూర్యాపేట):** మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన జంపాల పరమేష్ ఇంట్లో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నగదు, బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పరమేష్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఉదయం బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండటం గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 2.50గ్రాముల బంగారం, 10తులాల వెండి ఆభరణాలు, రూ.60వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



యాదగిరిగుట్ట: కిష్టయ్య ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

### ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

**చౌటుప్పల్:** మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన మహిళ శుక్రవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపురం మండలం మర్రిబావితండాకు చెందిన మాధవి(28)కి అదే మండలం డాకుతండాకు చెందిన కరంటోతు లింగానాయక్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. లింగానాయక్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, వీరు చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో నివాసముంటున్నారు. ఇంట్లో ఎల్లమ్మ పండుగ చేస్తే కుటుంబం సంతోషంగా ఉంటుందని మాధవి భర్తకు చెప్పింది. కానీ పండుగ చేసే అంశాన్ని కొద్దిరోజుల పాటు వాయిదా వేయాలని భర్త సూచించాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య కొద్దిరోజులుగా గొడవ జరుగుతుంది. దీంతో మనస్తాపానికి గురైన మాధవి శుక్రవారం రాత్రి పదకొండున్నర గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి సభావత్ పూల్యా శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మల్లికార్జున్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### మెరుగైన న్యాయ సేవలు అందించాలి

**భువనగిరి:** జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ ద్వారా ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందించాలని యాదాద్రి జిల్లా జడ్జి వి. బాలభాస్కర్‌రావు అన్నారు. నూతనంగా ఏర్పాటైన జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యుల సమావేశాన్ని శనివారం జిల్లా కోర్టు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్రజలకు సేవలందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కె. దశరథరామయ్య, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశవరెడ్డి, ప్రభుత్వ న్యాయవాది అంజయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**పారా లీగల్ వలంటీర్స్‌తో సమావేశం:** పట్టణంలోని జిల్లా కోర్టులో పారా లీగల్ వలంటీర్స్, ప్యానల్ న్యాయవాదులతో న్యాయ సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి దశరథరామయ్య పాల్గొని మాట్లాడారు. ప్రజలకు, న్యాయ సేవా సంస్థకు పారా లీగల్ వలంటీర్లు అనుసంధానంగా ఉండి పూర్తి అంకితభావంతో సేవలందించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదాద్రి జిల్లా జడ్జి బాలభాస్కర్‌రావు

# హత్య కేసులో నిందితుడి రిమాండ్

**మిర్యాలగూడ టౌన్:** మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో ఈ నెల 1వ తేదీన మద్యం మత్తులో వ్యక్తి తలపై మిషన్ భగీరథ పైపుతో కొట్టి చంపిన నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్‌ఐ ముత్తినేని సత్యనారాయణ శనివారం విలేకరులకు వెల్లడించారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. తడకమళ్ల గ్రామంలో ఈ నెల 1వ తేదీన జంగాల సుధాకర్ అనే వ్యక్తి తలపై తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన చిటికెల మల్సూర్ మద్యం మత్తులో మిషన్ భగీరథ పైపుతో కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. అతడు హత్యకు ఉపయోగించిన ఐరన్ పైపును కూడా స్వాధీనం చేసుకున్నామని అన్నారు. శనివారం నిందితుడిని మిర్యాలగూడ కోర్టులో ప్రవేశపెట్టగా ఫస్ట్ ఏడీఎం జడ్జి సుమబాల 14రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ తరలించాలని ఆదేశించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

**హత్యాయత్నం కేసులో..**

**నాగార్జునసాగర్:** నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కొంతమంది యువకులపై బీరు బాటిళ్లతో దాడి చేసిన నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు నాగార్జునసాగర్ సీఐ నాగరాజు, విజయపురి టౌన్ ఎస్‌ఐ రాంబాబు తెలిపారు. ఈ దాడిలో శ్రీకాంత్, షేక్ మీరావలి, కామిని కార్తీక్ తీవ్రంగా గాయపడ్డారని, వారిపై దాడి చేసిన పొట్టిపోగు అఖిల్, అందుగుల రాహుల్, గుడిపల్లి నాగార్జునతో పాటు మరో ఇద్దరు మైనర్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.



నాగార్జునసాగర్: వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు, ఎస్‌ఐ రాంబాబు

**బాలికలను బంధించిన యువకుడికి..**

**భువనగిరి:** మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామంలో ఇద్దరు బాలికలను బంధించిన మేడబోయిన యాకేష్‌ను శుక్రవారం సాయంత్రం పట్టణంలోని బస్టాండ్‌లో ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. అతడిపై పోక్సో, కిడ్నాప్, రేప్ కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. కాగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెటింగ్ కొనసాగుతుంది.

# అనుమానం పెనుభూతమై..

- భార్యపై కిరోసిన్ పోసి నిప్పంటించిన భర్త
- అక్కడికక్కడే మృతి
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘటన

**సూర్యాపేట క్రైం:** అనుమానం పెనుభూతమై ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. భార్యపై అనుమానంతో ఆమెపై పెట్రోల్ పోసి సజీవ దహనం చేశాడు భర్త. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీరామ్‌నగర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామ్‌నగర్‌కు చెందిన దాసోజు వాసు, నిర్మల భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. వాసు ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తుండగా, నిర్మల ఇంటి వద్దనే ఉంటూ టైలరింగ్ చేస్తుంది. రెండేళ్లుగా మద్యానికి బానిసైన వాసు భార్యపై అనుమానంతో తరచూ ఆమెతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం మద్యం తాగి వచ్చిన వాసు ఇంట్లో భార్యతో ఘర్షణకు దిగి మద్యం మత్తులో ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. నిర్మల మంటల్లో కాలిపోతూ ఉండడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే నిర్మల మంటల్లో పూర్తిగా కాలిపోయి మృతిచెందింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మందుబాబులకు జైలుశిక్ష, జరిమానా

**యాదగిరిగుట్ట:** మద్యం సేవించి వాహనాలు నడిపిన పలువురిని శనివారం ఆలేరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా వారికి జడ్జి జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ శివశంకర్‌గౌడ్ తెలిపారు. 41 మందికి రూ.2వేల జరిమానా, 15మందికి రూ.2వేలు జరిమానాతో పాటు ఒక్క రోజు జైలుశిక్ష, నలుగురికి రూ.2వేల జరిమానా రెండు రోజుల జైలుశిక్ష, ఒక్కరికి రూ.2వేల జరిమానాతోపాటు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ సీఐ పేర్కొన్నారు. వీరి నుంచి 25 బైక్‌లు, 4 మూడు చక్రాల వాహనాలు, 32 కార్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

### విద్యుత్ మోటార్లు చోరీ

**చిలుకూరు:** మండలంలోని రామాపురం ఆర్‌కే మేజర్ కాలువపై శుక్రవారం రాత్రి ఇద్దరు రైతుల విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. వివరాలు.. రామాపురం గ్రామానికి చెందిన పుల్లూరి లచ్చినర్సయ్యకు చెందిన విద్యుత్ మోటారు ఒకటి ఆర్‌కే మేజర్ కాలువపై 15రోజుల క్రితం చోరీకి గురైంది. దీంతో రూ.20వేలు అప్పు తెచ్చి మరో విద్యుత్ మోటారును కాలువపై ఏర్పాటు చేసుకున్నాడు. దానిని కూడా శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. అదే కాలువపై మరో రైతు పుల్లూరి నాగేశ్వరరావుకు చెందిన విద్యుత్ మోటారు కూడా దొంగతనానికి గురైంది. వీరు శనివారం చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### ఎనిమిది ఇసుక లారీల పట్టివేత

**చౌటుప్పల్:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎనిమిది లారీలను మండల పరిధిలోని జైకేసారం గ్రామ శివారులో శనివారం పోలీసులు పట్టుకున్నారు. సూర్యాపేట ప్రాంతంలోని మూసీ ప్రాజెక్టు నుంచి ఈ లారీల్లో ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును మైనింగ్ శాఖకు అప్పగించామని ఎస్‌ఐ అనిల్ తెలిపారు.

# బయోమెట్రిక్ లోపాలను సరిచేయాలి



నల్లగొండ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

**నల్లగొండ టూటౌన్:** మున్సిపల్ కార్మికుల హాజరు విషయంలో బయోమెట్రిక్‌లో జరిగిన లోపాలను సరి చేసి, కార్మికులకు రావాల్సిన పూర్తి వేతనాన్ని ఇవ్వాలని సీఐటీయూ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం డిమాండ్ చేశారు. శనివారం కార్మికులతో కలిసి నల్లగొండ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయోమెట్రిక్‌లో లోపాలతో కార్మికులకు రావాల్సిన నెల జీతం ఒక్కొక్కరికి రూ.5వేల నుంచి రూ.6వేల వరకు కోత పడిందని, బయోమెట్రిక్ మిషన్‌లో జరిగిన తప్పిదాలను వెంటనే సరి చేసి రావాల్సిన వేతనాన్ని కార్మికులకు ఇవ్వాలన్నారు. గతంలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కరించలేదని వాపోయారు. 2021 పీఆర్సీకి సంబంధించి గతంలో ఇచ్చిన హామీ మేరకు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, యూనియన్ జిల్లా కార్యదర్శి జక్కల రవికుమార్, మోయినుద్దీన్, శేఖర్, పేరి కృష్ణ, సంజీవ, అంజమ్మ, శ్రవణ్‌కుమార్, సైదులు, నాగుల కరుణ, కృష్ణవేణి, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### బాలిక అదృశ్యం

**కట్టంగూర్:** మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక 10రోజుల క్రితం అదృశ్యమైంది. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రేమ పేరుతో బాలికను అపహరించినట్లు బాధిత కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.



# వరిని ఆశిస్తున్న ఆకుతుప్పు తెగులు

- నష్టపోతున్న రైతులు
- జింక్ చిల్లేట్ పిచికారీ చేయాలంటున్న వ్యవసాయ అధికారులు

**ఆత్మకూరు(ఎం):** వరి పంటకు తెగుళ్లు సోకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆత్మకూరు మండలంలో ప్రస్తుతం 2580 ఎకరాల్లో వరి సాగు చేశారు. వరి పంటను ఆకుతుప్పు తెగులు వెంటాడుతుంది. నాటు వేసిన నెల లోపే ఆకుతుప్పు తెగులు సోకింది. జింక్ లోపంతో వాతవరణంలో ఏర్పడ్డ మార్పుల వల్ల వరి పంటకు ఆకుతుప్పు తెగులు సోకుతుందని, ఈ తెగులు సోకిన వరి ఆకు కొనలు ఎర్రగానూ, పసుపు రంగులో మారుతాయని మండల వ్యవసాయ అధికారి ఎస్. శిల్ప తెలిపారు. ఆకులపై నల్లటి మచ్చలు కనిపిస్తాయని, ఈ తెగులు పంట ఎదుగుదలను ఆపేస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ వరితుప్పు తెగులు నివారణకు జింక్ చిల్లేట్‌ను 5లీటర్ల నీటిలో రెండు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేసినట్లయితే తగ్గుముఖం పడుతుందని ఆమె తెలిపారు.



ఆకుతుప్పు తెగులు ఆశించిన వరి చేను

**తగ్గుముఖం పట్టలేదు**



ఏడు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఆకు తుప్పు తెగులు ఆశించింది. వరి చేనంతా పూర్తిగా ఎర్రగా మారింది. ఆకు కొనలపై నల్లటి మచ్చలు కనిపిస్తున్నాయి. రసాయన మందులు పిచికారీ చేసినా ఫలితం కనిపించడం లేదు.
– ఎస్. గణేష్, రైతు, కూరెళ్ల, ఆత్మకూరు(ఎం)

పాడి పంట

# క్షేత్ర పర్యటనలతో విద్యార్థులకు ప్రయోజనం

**గరిడేపల్లి:** క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ అన్నారు. శనివారం మండలంలోని గడ్డిపల్లి కేవీకేను కోదాడ పట్టణంలోని తేజ విద్యాలయానికి చెందిన 8, 9వ తరగతి విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ్, సుగంధి, మాధురి విద్యార్థులకు భూసార పరీక్ష కేంద్రం, జీవన ఎరువుల ఉత్పత్తి విభాగం, అజోల్లా సాగు, మిశ్రమ చేపల పెంపకం, వర్మీ కంపోస్ట్, వర్మీ వాష్, కూరగాయలు, పూల నారు, పట్టు పురుగులు, పుట్టగొడుగుల పెంపకం, వరి సాగు తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు రేణుక, శ్రీనాథ్, సరళ, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**అజోల్లాపై సాగుపై అవగాహన..**

మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం హైదరాబాద్‌లోని లయోలా వ్యవసాయ కళాశాల విద్యార్థులకు వరి పొలాల్లో అజోల్లా సాగు విధానంపై కేవీకే ఇన్‌చార్జి, హోం సైన్స్ శాస్త్రవేత్త సుగంధి అవగాహన కల్పించారు. అజోల్లా నీటి మీద తేలుతూ నాచులాగా ఉంటుందని, ఇది పంట సాగులో జీవన ఎరువుగా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థినులు శృతి, శ్రియ, మౌనిక, రమాదేవి, తేజశ్రీ, శ్రావణి, ధనలక్ష్మి, హర్షిణి తదితరులున్నారు.



విద్యార్థులకు జీవన ఎరువుల గురించి వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు